E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :309 అదివారం 18 అక్టోబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## కస్టడీలోనే అభిజిత్ దీప్కే.. నేహా బోరా విడుదల!



2 లో

నేహా బోరాకు పోలీసుల నుంచి విముక్తి

ఢిల్లీలో నిరసనల వేళ అరెస్టులు

తిరంగ యాత్రకు పోలీసుల అభ్యంతరం

నోటీసులు ఉల్లంఘించారని ఆరోపణ

మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చే యోచన

రూ.50 వేల పూచీకత్తుతో విడుదల

## నామినేషన్ల వేళ ఉద్రిక్తత..

స్థానిక ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు

పుంగనూరు, రాయచోటిలో మూడు కేసులు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన ఎస్ఈసీ

తాడిపత్రిలో భారీగా పోలీసుల మోహరింపు

కడపలో వైసీపీ--టీడీపీ శ్రేణుల రాళ్లదాడి

నామినేషన్ కేంద్రం వద్ద కత్తిపోట్లు..



2 లో

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఉద్రిక్తతల మధ్య కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కఠిన చర్యలు చేపట్టామని ఐజీ రాజకుమారి స్పష్టం చేయగా, హింసాత్మక ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. మరోవైపు సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందిన తాడిపత్రిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఐజీ రాజకుమారి

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టామని ఐజీ రాజకుమారి తెలిపారు. పుంగనూరు, రాయచోటి ఘటనలపై ఇప్పటికే మూడు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కొందరు నిబంధనలను ఉల్లంఘించి రావడంతోనే అక్కడ ఘర్షణలు తలెత్తాయన్నారు. నిన్నటి ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను మరింత పెంచామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.

## బీజేపీ రాజకీయాలకు ఈసీ వాడకం

నాకూ ఎస్ఐఆర్ నోటీసొచ్చింది

బీజేపీకి నచ్చని ఓట్ల తొలగింపు: మహేష్ గౌడ్

ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ ఆగ్రహం

ఎస్ఐఆర్‌లో పారదర్శకత ఏదీ?

ఎన్నికల సంఘంపై మహేష్ గౌడ్ ఫైర్

సీఈసీ నియామకంపై కాంగ్రెస్ ప్రశ్నలు

ప్రజాస్వామ్యానికి ముప్పు: మహేష్ గౌడ్

2 లో

## ప్రాణం తీసిన న్యూడుల్స్

నూడుల్స్ తిని ఐదుగురి మృతి

తెల్లారేసరికి విషాదంలో కుటుంబం

గ్రేటర్ నోయిడాలో కలకలం

మృతుల్లో ముగ్గురు చిన్నారులు

ఫుడ్ పాయిజనింగ్‌పై పోలీసుల అనుమానం

పరీక్షలకు ఆహార నమూనాలు

పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూపులు

గతంలో మహారాష్ట్ర ఘటనతో పోలిక



2 లో

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని ఓవైపు వైద్యులు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నా.. ఒకట్రెండు సార్లు తింటే ఏమవుతుందిలే అన్న ధోరణిలో ఉంటున్నారు ప్రజలు. తాజాగా.. ఓ కుటుంబంలో ఐదుగురు.. న్యూడుల్స్ తిని నిద్రపోగా.. నిద్రలోనే మృత్యుఒడికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రేటర్ నోయిడాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రబుపుర ప్రాంతానికి చెందిన కుటుంబం అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోగా.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతులను మహేష్ (37), లలిత (35), లడ్డు (11), మిష్టి (7), సాక్షాత్ (3)లుగా గుర్తించారు. గతరాత్రి వారంతా నూడుల్స్ తిని, టీ తాగి పడుకున్నట్లుగా మహేష్ తల్లి పోలీసులకు చెప్పారు.దీంతో ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం

లోయలో పడిన మినీబస్సు.. 8 మంది మృతి

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై విషాదం

బురద కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

వంతెనపై నుంచి పడిన మినీబస్సు

క్రేన్‌తో బస్సును బయటకు తీసిన సిబ్బంది

ఆసుపత్రికి క్షతగాత్రుల తరలింపు

2 లో

## చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం

తెలంగాణ నీళ్లపై కుట్రలు: హరీశ్

నీటి విషయంలో సర్కారు నిర్లక్ష్యం

దేవాదులలో మూడు మోటార్లే ఆన్

ఎల్‌నినో పేరుతో చేతులెత్తేశారు

గోదావరి జలాల తరలింపునకు యత్నాలు

కేసీఆర్ హయాంలో లేని ప్రతిపాదనలు

తెలంగాణ కరువుకు సీఎం కారణమని ఆరోపణ

2 లో




## రెండు రాష్ట్రాలు భారీ అవకాశాలు!

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు పోటీపడే ధోరణికి స్వస్తి పలికి, పరస్పర సహకారంతో పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రెండు రాష్ట్రాల బలాలు ఒకే విలువ ఆధారిత పారిశ్రామిక గొలుసులోని రెండు భాగాల వంటివని పేర్కొన్నారు. బెంగళూరులోని ఆర్టెజియా హోటల్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 రోడ్‌షోలో మంత్రి మాట్లాడారు. కర్ణాటక పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని.. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026లో పాల్గొనాలని ఆహ్వానించారు.

- పెట్టుబడులకు తెలంగాణే గమ్యం!
- రెండు రాష్ట్రాలు.. అపార అవకాశాలు!
- బెంగళూరు ఆలోచనలు.. హైదరాబాద్‌లో తయారీ!
- గ్లోబల్ కంపెనీలకు తెలంగాణ ఆహ్వానం!
- డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్!
- ఏరోస్పేస్ నుంచి ఏఐ వరకు.. కొత్త పుంతలు!
- తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యమేంటి?
- ఫ్యూచర్ సిటీతో పారిశ్రామిక విప్లవం!

మిగతాది 2 లో..

## జవాన్ల కోసం కేంద్రం కీలక ప్రతిపాదన!



2 లో

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళమైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం రద్దు చేసిన ఆర్మీ ర్యాంకులైన 'లాన్స్ నాయక్', 'నాయక్' హోదాలను తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సిబ్బందికి పదోన్నతులు ఆలస్యం కావడం, విధుల్లో అసంతృప్తిని తగ్గించడం, ఆర్మీ నుంచి పదవీ విరమణ చేసే అగ్నివీరులకు అవకాశాలు కల్పించడం ఈ ప్రతిపాదన వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ మేరకు శనివారం అధికారుల ద్వారా ఈ వివరాలు వెల్లడైనట్లు జాతీయ మీడియా పేర్కొంది.

## ఛత్తీస్‌గఢ్‌లో భూకంపం.. 3.5 తీవ్రత!



2 లో

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం భూమి స్వల్పంగా కంపించింది. అంబికాపూర్ నగరానికి ఉత్తర-వాయువ్యంగా దాదాపు 140 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ అధికారికంగా ధ్రువీకరించింది.

## ఎల్‌నినోపై తెలంగాణ సర్కార్ అలర్ట్!

10 ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్‌లు

తాగు, సాగునీటి కొరతపై ప్రత్యేక నజర్

వాతావరణ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

విద్యుత్ సరఫరాపై అధికారుల సమీక్ష

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలకు ఆదేశాలు

ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి




2 లో

**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** రాష్ట్రంలో తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావం, తాగు, సాగునీటి కొరత , ముంచుకొస్తున్న వాతావరణ అత్యవసర పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, తగిన అత్యవసర చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాల వారీగా పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అనుభవజ్ఞులైన అధికారులకు అప్పగించింది.

## తీహార్ జైలులో సీజేపీ నేతలకు స్పెషల్ ట్రీట్‌మెంట్




2 లో

తీహార్ జైలులో సీజేపీ నేతలకు ప్రత్యేక భద్రత

వేర్వేరు హైసెక్యూరిటీ వార్డులకు తరలింపు

సీసీటీవీలతో నిరంతర నిఘా

సూసైడ్ వాచ్‌లో ఇద్దరు నేతలు

ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కోర్టు ఆదేశం

ఖైదీల కదలికలపై జైలు అధికారుల నజర్

తోటి ఖైదీని కలిసే విజ్ఞప్తికి నిరాకరణ

# జవాన్ల కోసం కేంద్రం కీలక ప్రతిపాదన!

మొదటి పేజీ తరువాయి




ఈ ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ యూనిట్లు, బలగాల ప్రధాన కార్యాలయాలు భాగస్వామ్య సమావేశాలు లేదా 'సైనిక్ సమ్మేళనాలు' నిర్వహించి, సిబ్బంది అభిప్రాయాలను కేవలం రెండు రోజుల్లోగా సేకరించాలని సీఆర్పీఎఫ్ ప్రధాన కార్యాలయం ఆదేశించింది.

నేపథ్యం ఏమిటి?

సీఆర్పీఎఫ్లో గతంలో ఉన్న లాన్స్ నాయక్, నాయక్ హోదాలను 1997లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రద్దు చేసి, వాటిని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అనే పోలీసు హోదాలలో విలీనం చేశారు. అయితే, ఈ రెండు హోదాలు ఇప్పటికీ భారతీయ సైన్యంలో కొనసాగుతున్నాయి. అయితే ఆర్మీ నిబంధనల ప్రకారం ఒక జవాను కానిస్టేబుల్‌గా చేరిన తర్వాత 5 ఏళ్లకు లాన్స్ నాయక్, 10 ఏళ్లకు నాయక్, 20 ఏళ్లకు హెడ్ కానిస్టేబుల్ హోదా పొందుతాడు. ప్రస్తుతం సుమారు 3.25 లక్షల బలగంతో ఉన్న సీఆర్పీఎఫ్లో... కానిస్టేబుల్ స్థాయి సిబ్బందికి ప్రమోషన్ల విషయంలో తీవ్ర స్తబ్దత నెలకొంది. ప్రస్తుతం ఒక కానిస్టేబుల్‌కు మొదటి ప్రమోషన్ రావడానికి సరాసరిగా 22 నుంచి 25 సంవత్సరాలు పడుతోంది. ఒక్కటే ర్యాంకులో దశాబ్దాల తరబడి కొనసాగడం వల్ల జవాన్లలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి, హెడ్ కానిస్టేబుల్ స్థాయికి చేరేలోగా సిబ్బందికి మరో రెండు ప్రమోషన్లు కల్పించాలనే ఉద్దేశంతో లాన్స్ నాయక్, నాయక్ హోదాలను తిరిగి తీసుకురావాలని భావిస్తున్నారు. దీనివల్ల జవాన్ల నిరాశ తొలగిపోవడంతో పాటు వారిలో మనోధైర్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు.

అగ్నివీరుల కోసమేనా?

కేంద్ర ప్రభుత్వ అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో నాలుగేళ్ల కాలానికి రిక్రూటైన తొలి విడత 'అగ్నివీరులు' త్వరలో రిటైర్ కానున్నారు. రిటైరైన అగ్నివీరులు సీఆర్పీఎఫ్ తో పాటు ఇతర కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో చేరేందుకు అర్హులు. సీఆర్పీఎఫ్ సర్వీసును వారికి మరింత ఆకర్షణీయంగా మార్చేందుకే ఈ మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బలగాలలో అనధికారికంగా సీనియర్ కానిస్టేబుల్ హోదాను ఇస్తున్నారు గానీ నాయక్ హోదాకు ఎటువంటి ఏర్పాట్లు లేవు.

భిన్నాభిప్రాయాలు:

ఎక్స్-పారామిలటరీ పర్సనల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రణ్?బీర్ సింగ్ స్పందిస్తూ ఈ ప్రతిపాదిత విధానం వల్ల కాలానికి తగినట్లుగా ప్రమోషన్లు లభిస్తేనే జవాన్లకు మేలు జరుగుతుందని లేదంటే ఈ కసరత్తు వృథా అవుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఈ హోదాల పునరుద్ధరణ కేవలం ఒక అలంకారిక చర్యగా ఉండకూడదని, బెటాలియన్ క్రమశిక్షణ, కార్యాచరణ సామర్థ్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఒక సీనియర్ కమాండెంట్ పేర్కొన్నారు.

# బీజేపీ రాజకీయాలకు ఈసీ వాడకం



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో తీవ్ర లోపాలు ఉన్నాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విధానంలో పారదర్శకత లోపించిందని, స్వయంగా తనకు కూడా నోటీసు వచ్చిందని ఆయన తెలిపారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఎన్నికల వ్యవస్థలో అవలంబించాల్సిన ప్రాథమిక నిబంధనలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. 'ఎవరైనా వ్యక్తి మరణిస్తే ఓటు తొలగించాలి.. వేరే ప్రాంతానికి బదిలీ అయితే ఓటు మార్పిడి జరగాలి. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి నచ్చని ఓట్లను ఏకపక్షంగా తొలిగించే కుట్ర జరుగుతోంది' అని విమర్శించారు.

ఎలక్షన్ కమిషన్ స్వతంత్రతపై ప్రశ్నలు..

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహేష్ కుమార్ గౌడ్, ఇన్నాళ్లూ ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ప్రయోగించిన బీజేపీ, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు. ముఖ్యంగా కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో తెచ్చిన మార్పులను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. సీఈసీ ఎంపిక కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర వ్యవస్థల విధుల్లో కేంద్రం జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని హెచ్చరించారు.

# ప్రాణం తీసిన న్యూడుల్స్

మొదటి పేజీ తరువాయి

వారి మరణాలకు గల అసలు కారణం పోస్టుమార్టమ్ రిపోర్ట్ వచ్చాకే తెలుస్తుందని తెలిపారు. మరోవైపు ఫుడ్ సేఫ్టీ అధికారులు సైతం రంగంలోకి దిగారు. మహేష్ కుటుంబం చివరిగా నూడుల్స్ తిన్న శాంపిల్స్ ను సేకరించి టెస్టులకు పంపారు.



కొన్నినెలల క్రితం బిర్యానీ తిని, ఆ తర్వాత పుచ్చకాయ తిన్న కాసేపటికే ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించిన విషయం తెలిసిందే. మహారాష్ట్రలో ఈ ఘటన జరగ్గా.. గ్రేటర్ నోయిడాలో జరిగిన తాజా సంఘటన ఆ మరణాలను గుర్తుచేస్తోంది. వారంతా ఫుడ్ పాయిజనింగ్ కారణంగానే మరణించినట్లు పోస్టుమార్టం రిపోర్టుల్లో తేలింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భూకంపం.. 3.5 తీవ్రత!



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం భూమి స్వల్పంగా కంపించింది. అంబికాపూర్ నగరానికి ఉత్తర-వాయువ్యంగా దాదాపు 140 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రతతో నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ అధికారికంగా ధ్రువీకరించింది. తెల్లవారుజామున 04:36 గంటల సమయంలో భూమి కంపించడంతో నిద్రలో ఉన్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భూ అంతర్భాగంలో సంభవించిన ఈ స్వల్ప కుదుపుల వల్ల సమీప గ్రామాల్లోని ఇళ్ల లోని వస్తువులు స్వల్పంగా కదిలినట్లు సమాచారం అందింది.

అయితే, భూకంప తీవ్రత తక్కువగానే ఉండటంతో ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ సంభవించలేదని స్థానిక అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. ఎలాంటి తీవ్రమైన ప్రమాదాలు జరగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన రెవెన్యూ, విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నాయి. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, పుకార్లను నమ్మవద్దని అధికారులు సూచించారు.

# చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ సమాజానికి తీరని ద్రోహం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మన ప్రాజెక్టుల్లో నీళ్లే లేకుండా చేసే కుట్రలు జరుగుతున్నాయని, ఎల్ నినో పేరుతో పూర్తిగా చేతులు ఎత్తేస్తున్నారని మండిపడ్డారు. అత్యంత ప్రాధాన్యత ఉన్న నీళ్ల విషయంలో ఎందుకు మీకు నిర్లక్ష్యం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. దేవాదులలో 10 మోటార్లు ఉన్నా మూడు మోటార్లే ఆన్ చేశారని, మేము అభ్యంతరాలు చెప్పిన తర్వాతే ఈ ప్రభుత్వం స్పందిస్తోందన్నారు. తెలంగాణలో ఈ కరువు పరిస్థితికి సీఎం రేవంత్ రెడ్డి కారణం అని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ కంటే ఏపీలో తక్కువ వర్షపాతం నమోదైంది. కానీ ఏపీలో కరువు, క్రాప్ హాలీడే లేదన్నారు.

**చంద్రబాబుకు రేవంత్ సహకారం:**

గోదావరిని కబళించే ప్రయత్నాలను చంద్రబాబు చేస్తున్నారని, గోదావరి-కావేరి లింక్ పేరుతో నీటిని తరలించే కుట్రలకు ప్రయత్నాలు జరుగుతుంటే ఇందుకు రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు విఫలం అయ్యాయని ఇప్పుడు గోదావరి-కావేరి పేరుతో ఇక్కడి జలాలు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం ఏపీ నేతలు ఏమీ మాట్లాడలేదని రేవంత్ రెడ్డి వచ్చాకే ఏపీ పాలకులు కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారన్నారని విమర్శించారు.

# రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** రాజస్థాన్‌లోని కోటా జిల్లా పరిధిలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తున్న ఒక మినీ బస్సు అనియంత్రితంగా పక్కనే ఉన్న డ్రెయిన్ (లోతైన కాలువ)లోకి దూసుకెళ్లిన ఘటనలో 8 మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. సిమ్లియా పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వేకువజామున 6 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 25 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం.

సుమారు 15 అడుగుల ఎత్తు ఉన్న వంతెన నుంచి బస్సు కింద ఉన్న బురద, నీటితో నిండిన డ్రెయిన్‌లో పడిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు, పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును పైకి తీసి గాయపడిన ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి గల పూర్తి కారణాలు, క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కస్టడీలోనే అభిజిత్ దీప్కే.. నేహా బోరా విడుదల!



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఢిల్లీలో సీజేపీ నిరసనల వేళ ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇప్పటికీ దీప్కే పోలీసుల కస్టడీలోనే ఉన్నారు. శాంతి భద్రతల భంగం కింద సెక్షన్లు 126, 170 కింద దీప్కే ను పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలుస్తోంది. అతడిని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చబోతున్నట్టు సమాచారం. కానాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్ వద్ద దీప్కే లెహ్రా దో తిరంగా (తిరంగ యాత్ర) నిరసనకు దీప్కే పిలుపునివ్వగా, నిరసన చేపటొద్దని నోటీసులు ఇచ్చినప్పటికీ అతడు వాటిని పాటించడంలో విఫలం అయ్యాడని చెబుతున్నారు.

గతంలో జరిగిన అరెస్ట్ సమయంలో శాంతి ఒప్పందంలోని షరతులను దీప్కే ఉల్లంఘించారని పోలసులు మెజిస్ట్రేట్ ముందు చెప్పనున్నారు. దీప్కేను రూ.50వేల పూచీకత్తుతో విడిచిపెట్టినట్టు తెలిపారు. ఏడాది పాటు ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని అతడిని ఆదేశించినట్టు చెప్పారు. మరోవైపు ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను విడిచిపెట్టినట్టు పోలీసులు తెలిపారు. ఇద్దరిని శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకోగా నేహాబోరాను అదేరోజు సాయంత్రం విడిచిపెట్టినట్టు చెప్పారు.

# ఎల్‌నినోపై తెలంగాణ సర్కార్ అలర్ట్!

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు జయేష్ రంజన్, రంగారెడ్డి జిల్లాకు వికాస్ రాజ్, కరీంనగర్ జిల్లాకు బెనహర్ మహేష్ దత్తా ఎక్కా, మెదక్ జిల్లాకు ఎ. వాణి ప్రసాద్ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు యోగితా రాణా, నల్గొండ జిల్లాకు హరిచందన దాసరి, ఆదిలాబాద్ జిల్లాకు ఇలాంబర్తి కె., వరంగల్ జిల్లాకు ఎ. శ్రీదేవిసేన, మహబూబ్‌నగర్ జిల్లాకు వి.పి. గౌతమ్, ఖమ్మం జిల్లాకు అనుదీప్ దురిశెట్టి నియమితులయ్యారు.

**క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, కార్యాచరణ**

నియమితులైన ప్రత్యేక ఐఏఎస్ అధికారులు తమకు కేటాయించిన ఉమ్మడి జిల్లాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తాగునీటి ఎద్దడి, సాగునీటి లభ్యత, వర్షపాతం నమోదు స్థితిగతులను సమీక్షిస్తారు. వీటితో పాటు వ్యవసాయం, గృహ అవసరాలకు అందుతున్న విద్యుత్ సరఫరా తీరుపై క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేస్తారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా తక్షణ ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలు అందించేలా కార్యాచరణను సిద్ధం చేశారు.

# నామినేషన్ల వేళ ఉద్రిక్తత.. రంగంలోకి ఎస్ఈసీ!

మొదటి పేజీ తరువాయి

రాజకీయ పార్టీల ఫిర్యాదులపై ఎస్ఈసీ తక్షణ స్పందన

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై వివిధ రాజకీయ పార్టీల నేతలు తనను కలిసి ఫిర్యాదు చేశారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేతా తెలిపారు. పార్టీల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, ఆయా జిల్లాల కలెక్టర్లకు సమాచారం అందించామని, తక్షణమే పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పిస్తున్నట్లు ఎస్ఈసీ వెల్లడించారు.

తాడిపత్రిలో ఉద్రిక్త వాతావరణం.. భారీగా పోలీసుల మోహరింపు

నామినేషన్ల ఘట్టం మునుగుతున్న వేళ అనంతపురం జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతమైన తాడిపత్రిలో పోలీసులు భారీగా మోహరించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మున్సిపల్ ఆఫీస్ చుట్టూ ఇనుప కంచెలను ఏర్పాటు చేయడంతో పాటు, వజ్ర వాహనం, బాష్పవాయువు గోళాలను సిద్ధంగా ఉంచారు. అలాగే, నామినేషన్ల దాఖలు కోసం టీడీపీ, వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా వేర్వేరు గదులను కేటాయించారు. ఎన్నికల ప్రశాంత వాతావరణంలో ముగిసేలా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు కడపలో వైసీపీ - టీడీపీ శ్రేణులు రాళ్లదాడి చేసుకున్నారు. మూడు వాహనాలు ధ్వంసమవ్వగా.. జిల్లాలోని మరియాపురం నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ మాజీ డిప్యూటీ మేయర్ తనయుడికి కత్తిపోట్లు దిగాయి.

# తీహార్ జైలులో సీజేపీ నేతలకు స్పెషల్ ట్రీట్‌మెంట్




**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ప్రవేశించారనే ఆరోపణలతో అరెస్టయిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే. ఈ జైల్లో సీజేపీ నాయకులకు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇస్తారట. అంటే.. వీరిని ప్రత్యేక హై-సెక్యూరిటీ వార్డుల్లో వేర్వేరుగా ఉంచారట. ఇందుకు సంబంధించి అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలిశాయి.

అక్టోబర్ 14న శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పదే పదే ప్రయత్నించారన్న అభియోగాలతో ఢిల్లీ పోలీసులు వీరిద్దరినీ అరెస్టు చేశారు. ఒకవేళ వీరికి బెయిల్ ఇస్తే మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించి ఇతరులను రెచ్చగొట్టే అవకాశం ఉందన్న బలమైన అనుమానంతో, కోర్టు వీరిని ఐదు రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించింది. ఆ తర్వాతే వీరు తీహార్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఇక, జైలు రికార్డుల ప్రకారం.. అశుతోష్ రంకా ఖైదీ నంబర్ 1784 కాగా, సౌరవ్ దాస్ ఖైదీ నంబర్ 3752. మొదట వీరిద్దరినీ జైలు నంబర్ 2లోనే ఉంచారు. కానీ ఆ తర్వాత అశుతోష్ రంకాను జైలు నంబర్ 4కి మార్చారు. ప్రస్తుతం సౌరవ్ దాస్ జైలు నంబర్ 2లోని వార్డ్ నంబర్ 3లో ఉండగా, రంకా జైలు నంబర్ 4లోని వార్డ్ నంబర్ 15లో ఉన్నారు. మిగతా బ్లాక్‌లతో పోలిస్తే వీరు ఉన్న బ్లాక్‌లలో కొంచెం ఫ్రీగా ఉంటుందట.

ఈ వార్డులు చాలా ప్రత్యేకమైనవని జైలు వర్గాలు తెలిపాయి. వేరే వార్డులకు చెందిన ఏ ఖైదీని కూడా ఈ వార్డులలోకి అస్సలు రానివ్వరు. వీరి కదలికలను నిరంతరం గమనించేందుకు సెల్స్‌లోనే సీసీటీవీ కెమెరాలను అమర్చారు. అంతేకాకుండా రౌండ్-ది-క్లాక్ వీరిని సూసైడ్ వాచ్ (ఆత్మహత్య నిఘా) కింద ఉంచినట్లు ఓ అధికారి జాతీయ మీడియా సంస్థకు వెల్లడించారు. గురువారం నాడు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఆ పార్టీ లీగల్ హెడ్ రత్న సింగ్ వీరిని కలిసి పలకరించారు. సౌరవ్ దాస్ ఉన్న జైలు నంబర్ 2లోనే గతంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఉంచారు. అలాగే, ప్రస్తుతం జేఎన్‌యూ మాజీ విద్యార్థి, ఆందోళనకారుడు ఉమర్ ఖాలిద్ కూడా వేరే హై-రిస్క్ సెల్‌లో ఇదే జైలులో ఉన్నారు. ఇక రంకాను ఉంచిన జైలు నంబర్ 4ను గతంలో జైలు అధికారులు విపాసన ధ్యాన కార్యక్రమాల కోసం ఉపయోగించేవారట. అలాగే ఆయుధాల వ్యాపారి అభిషేక్ వర్మ కూడా గతంలో ఇక్కడే ఉన్నారట. ఈ జైలు జీవితంలో వీరిద్దరూ ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కోరలేదు. అయితే, వారిలో ఒకరు మాత్రం తోటి ఒక తోటి ఖైదీని కలిసేందుకు అనుమతివ్వాలని జైలు అధికారులను మౌఖికంగా కోరాడట. ఆ విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించినట్లు తెలుస్తోంది.

# రెండు రాష్ట్రాలు.. భారీ అవకాశాలు!

మొదటి పేజీ తరువాయి

కర్ణాటక నుంచి ఏదైనా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో తాము బెంగళూరుకు రాలేదని.. కర్ణాటకకు అద్భుతమైన బలాలు ఉన్నాయని.. తెలంగాణకు ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉన్నాయని చెప్పారు. ఈ రెండు రాష్ట్రాలు కలిసి పనిచేస్తే దేశ పారిశ్రామిక అభివృద్ధికి మరింత దోహదపడవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక విజ్ఞాన, పారిశ్రామిక వారసత్వాన్ని ప్రస్తావించిన మంత్రి, బెంగళూరు దేశంలోనే ప్రముఖ స్టార్టప్ కేంద్రంగా, ఏరోస్పేస్, అంతరిక్ష రంగాల్లో కీలక నగరంగా ఎదిగిందని పేర్కొన్నారు. హెచ్ఏఎల్, ఇస్రో, ఎన్ఏఎల్ వంటి సంస్థలు ఈ రంగాల్లో దేశానికి విశేష సేవలందిస్తున్నాయని చెప్పారు.

బెంగళూరులో విమాన ఇంజిన్ల రూపకల్పన జరిగితే, హైదరాబాద్‌లోని ఏరోస్పేస్ పార్కుల్లో వాటి విడిభాగాల తయారీ చేపట్టవచ్చని వివరించారు. అదేవిధంగా బెంగళూరులో పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసే టీకాలను తెలంగాణలోని జీనోమ్ వ్యాలీలో భారీ స్థాయిలో ఉత్పత్తి చేయవచ్చన్నారు. ప్రపంచ టీకాల ఉత్పత్తిలో జీనోమ్ వ్యాలీకి కీలక స్థానం ఉందని పేర్కొన్నారు. బెంగళూరులో చిప్‌ల రూపకల్పన, తెలంగాణలో ఎలక్ట్రానిక్స్ తయారీ, తెలంగాణ పత్తితో వస్త్రాల తయారీ, అంతర్జాతీయ బ్రాండ్లకు సరఫరా వంటి రంగాల్లో రెండు రాష్ట్రాల పరిశ్రమలు పరస్పరం సహకరించుకోవచ్చని సూచించారు. బెంగళూరులో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లోనూ తమ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. ఐఐఎస్సీ, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్‌బీ, ఐఐఐటీ వంటి విద్యాసంస్థల నుంచి లభించే నైపుణ్యం, టీ-హబ్ స్టార్టప్‌ల సామర్థ్యాలు పెట్టుబడిదారులకు ప్రయోజనకరంగా ఉంటాయని వివరించారు. జీనోమ్ వ్యాలీ లైఫ్ సైన్సెస్ రంగంలో కీలక కేంద్రంగా నిలవగా, రాష్ట్రంలోని ఏరోస్పేస్ పార్కుల్లో అంతర్జాతీయ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతలో భాగంగా 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అభివృద్ధి చేయడం, ఏఐ సిటీ, ప్రత్యేక మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, రీజినల్ రింగ్ రోడ్, కొత్త పారిశ్రామిక కారిడార్లు, మూసీ పునరుజ్జీవన కార్యక్రమం వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. ప్రాంతాల వారీగా అభివృద్ధి సాధించేందుకు రూపొందించిన క్యూర్-ప్యూర్-రేర్ విధానాన్ని కూడా వివరించారు.

# సీఈసీని వెంటనే తొలగించాలి.. డీఎంకే తీర్మానం..



**న్యూస్ డెస్క్, 17 అక్టోబర్ (తెలుగు గళం):** తమిళనాడు లోని ప్రతిపక్ష డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం పై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, ఈవీఎంల స్థానంలో తిరిగి బ్యాలెట్ విధానాన్నే ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా తీర్మానించారు.

శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలనేది వాటిలో ఒకటి.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలనేది వాటిలో తొలి తీర్మానంగా ఉన్నది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ.. ఆయనను వెంటనే తొలగించాలని ఆ తీర్మానంలో డిమాండ్ చేశారు. అయితే ఎలాంటి అవకతవకలు జరిగాయనేది మాత్రం పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. అయితే రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తున్నది.

విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు మద్దతు తెలుపుతూ డీఎంకే మరో తీర్మానం చేసింది. అయితే ఏ విద్యార్థి సంఘాలకు వారు మద్దతిస్తున్నారో స్పష్టంగా తెలియజేయలేదు. ఇక కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ మూడో తీర్మానం చేసింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా తీర్మానంలో వివరించలేదు. ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్రపతిని కోరుతూ నాలుగో తీర్మానం చేశారు.

## తిడుగులో వృద్ధులు, దివ్యాంగులకు చేయూత

• నల్ల తీగల శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేతి కర్రలు, బెడ్‌షీట్ల పంపిణీ



**తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ అక్టోబర్ 17**

వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలవాలనే సంకల్పంతో జఫర్గఢ్ మండలం తిడుగు గ్రామంలో నల్ల తీగల శ్రీకాంత్, కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి ఆధ్వర్యంలో చేతి కర్రలు, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నల్ల తీగల శ్రీకాంత్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో, బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. సమాజంలో ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా అవసరంలో ఉన్నవారికి సహాయం అందించడంతో పాటు సమాజంలో ఐక్యత, మానవీయ విలువలను పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి రాఘోత్తం రెడ్డి

• నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపిన ధర్మపురం గ్రామ సర్పంచ్



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ అక్టోబర్ 17**

ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామంలో భైరపాక వెంకట్, అనూష దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో ధర్మపురం గ్రామ సర్పంచ్ రమాదేవి రాఘోత్తం రెడ్డి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపి, వారు కుటుంబ సభ్యులతో కలిసి నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల సంతోషాల్లో భాగస్వాములవుతూ, వారి శుభకార్యాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించడం గ్రామ నాయకత్వంలో ముఖ్యమైన అంశమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. సర్పంచ్ రమాదేవి రాఘోత్తం రెడ్డి గృహప్రవేశ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేయడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్, మాజీ సర్పంచ్ గొట్టం రవి, ఎస్సీ సెల్ అధ్యక్షులు భైరుపాక దివాకర్, దయాకర్, భైరుపాక బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకలో భాగస్వాములయ్యారు.

## రావణాసుర దహన కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఆహ్వానం



**స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం, అక్టోబర్ 17:**

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ సందర్భంగా భారీ రావణ దహన కార్యక్రమం 14వ వార్డు లో గల క్రీడా ప్రాంగణంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలపడానికి సంతోషిస్తున్నామని అన్నారు. ఆరోజు సంస్కృత కార్యక్రమాలు ఆటపాటలతో 14వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి సారయ్య మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ రావణ వధ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పెసరు సారయ్య ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ కలెక్టర్ విచ్చేస్తున్నారు కాబట్టి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాల్సిందిగా కోరుతున్నామని అన్నారు పొన్న రవి, గట్టు రమేష్, తోకల రాజు, పొన్నం రాజయ్య, పున్న రవి మరియు తదితరులు పాల్గొన్నారు.

## వల్మిడిలో వైభవంగా శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామివారి తిరుమంజన అభిషేక సేవ

• జై శ్రీమన్నారాయణ.. జై జై శ్రీమన్నారాయణ..



**వల్మిడి, తెలుగు గళం న్యూస్ అక్టోబర్ 17**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం పురస్కరించుకొని స్వామివారికి తిరుమంజన అభిషేక సేవా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర అభిషేక సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు భక్తిపారవశ్యంతో స్వామివారి సేవలో పాల్గొని శ్రీ సీతారామచంద్ర స్వామివారి మంగళాశాసనాలు, దివ్య అనుగ్రహాన్ని పొందారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## బతుకమ్మ సంబరాలకు ముస్తాబైన చిన్న పెండ్యాల గ్రామం

• మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ ప్రత్యేక ఏర్పాట్లు
• ఆట స్థలం శుభ్రత, లైటింగ్ సౌకర్యాల కల్పన.. గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్




**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్/చిల్పూర్ అక్టోబర్ 17**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు జనగామ జిల్లా చిల్పూర్ మండలం చిన్న పెండ్యాల గ్రామం ముస్తాబవుతోంది. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు జరుపుకునేలా గ్రామ సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతూ, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు బతుకమ్మలు పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకునే ఆట స్థలాన్ని శుభ్రం చేయించారు. పండుగ వేళ మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు సౌకర్యవంతంగా ఉండేందుకు లైటింగ్ ఏర్పాట్లు చేపట్టారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలను విజయవంతం చేసేందుకు సర్పంచ్ కృషి చేస్తున్నారు.

**ప్రజా సౌకర్యాలే లక్ష్యంగా సర్పంచ్ ప్రత్యేక చొరవ**

గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, పండుగలు, సంప్రదాయ కార్యక్రమాల సమయంలో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ తీసుకుంటున్న చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఒకే చోట చేరి ప్రశాంతమైన వాతావరణంలో బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా ఆట స్థలం పరిశుభ్రత, వెలుతురు ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. గ్రామంలో పండుగలు ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకువచ్చేలా, ఐకమత్యం మరియు సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని సర్పంచ్ ఆకాంక్షిస్తున్నారు. గ్రామ ప్రజల సంతోషమే ముఖ్యమని భావిస్తూ, బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు.

**అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పండుగ జరుపుకోవాలి**

ఈ సందర్భంగా సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ మీడియాతో మాట్లాడుతూ, చిన్న పెండ్యాల గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, పూల గొప్పతనానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. గ్రామంలోని మహిళలందరూ బతుకమ్మ ఆట స్థలంలో ఒకే చోట చేరుకుని, సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు చేసుకోవాలని సూచించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా టపాసులు పేల్చడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండాలని, చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

**గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు**

బతుకమ్మ పండుగ ప్రతి ఇంట్లో సంతోషాలు నింపాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ ఆకాంక్షించారు. గ్రామంలో ఐకమత్యం వెల్లివిరియాలని, మహిళలందరూ సురక్షిత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరుతూ చిన్న పెండ్యాల గ్రామ ప్రజలకు హృదయపూర్వక బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సౌకర్యాలు, సంప్రదాయ పండుగల నిర్వహణపై శ్రద్ధ చూపుతూ సర్పంచ్ ఇల్లందుల తిరుపతమ్మ చేపడుతున్న ఏర్పాట్లు గ్రామంలో పండుగ సందడిని మరింత పెంచుతున్నాయి. ప్రజల సహకారంతో బతుకమ్మ వేడుకలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో సహా వార్డు సభ్యులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## తమ్మడపల్లి(జి)లో ఐద్వా ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

• మహిళల ఐక్యత, సమానత్వం కోసం ఉద్యమించాలి: ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా

**జాఫర్‌గఢ్, అక్టోబర్ 17 (తెలుగు గళం)**

జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి) గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం (అక్టోబర్ 16) సాయంత్రం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ ఆటపాటలతో సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ షబానా మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, రాష్ట్ర సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. పండుగలు కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా మహిళల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు, సామాజిక చైతన్యాన్ని తీసుకురావడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

**మహిళలకు సమాన హక్కులు కల్పించాలి**

సమాజంలో మహిళలకు నేటికీ సమాన హక్కులు దక్కడం లేదని, అనేక సందర్భాల్లో మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని షబానా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు పొందాలని, ఆడపిల్లలు భయం లేకుండా విద్యనభ్యసిస్తూ స్వేచ్ఛగా జీవించే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళల భద్రత, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం మహిళలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా "ఆడపిల్లలకు భయం లేని సమాజాన్ని నిర్మిద్దాం.. ఓటు హక్కును కాపాడుకుందాం.. ఊరు వాడ బతుకమ్మ ఆడుదాం" అనే నినాదాలతో మహిళల్లో చైతన్యం నింపారు. మహిళల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య




విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. అనంతరం మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలతో సందడి చేశారు. పండుగ వాతావరణంలో మహిళలంతా కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు గుండవైన రోజా, రాపర్తి లక్ష్మి, ఉప్పునూతల ఎల్లమ్మ, రాపర్తి ఏకలక్ష్మి, అంబటి సుజాత, కన్న పద్మ, వి. రజిత, కె. సుజాత, నక్క షైనీ, అనన్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

• ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**స్టేషన్ ఘన్‌పూర్, తెలుగు గళం న్యూస్ అక్టోబర్ 17**

తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రకృతిని దైవంగా భావించి పూజించే అరుదైన సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని కడియం శ్రీహరి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం నుంచి ఆవిర్భవించిన ప్రకృతి పండుగ బతుకమ్మ అని, దేవతలకు సమర్పించే పూలతోనే బతుకమ్మను పేర్చి పూజించడం ప్రకృతి పట్ల తెలంగాణ ప్రజలకు ఉన్న ఆరాధన, కృతజ్ఞతా భావానికి నిదర్శనమని అన్నారు. కులమతాలకు అతీతంగా సబ్బండ వర్గాల ప్రజలు సమిష్టిగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని తెలిపారు. తొమ్మిది రోజులపాటు సాగిన బతుకమ్మ వేడుకలతో పల్లెలు, పట్టణాలు ఆడబిడ్డల ఆటపాటలతో సాంస్కృతిక శోభను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకల అనంతరం విజయదశమి పండుగను స్వాగతించే



వేళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పండుగలను ఘనంగా నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ పండుగను సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని జగన్మాత గౌరీదేవిని ప్రార్థించినట్లు తెలిపారు.

## మానవసేవే లక్ష్యంగా అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సేవలు!

• హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న వారికి పండ్లు, చల్లని నీటి పంపిణీ.. మానవత్వం, సోదరభావానికి ప్రతీకగా సేవా కార్యక్రమాలు

**హనుమకొండ, తెలుగు గళం న్యూస్ అక్టోబర్ 17**





మానవసేవే మాధవసేవ అనే స్ఫూర్తితో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సమాజ సేవలో తనదైన పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలో ఎక్కడైనా ప్రకృతి విపత్తులు సంభవించినా, విధ్వంసాలు చోటుచేసుకున్నా, ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనా బాధితులకు అండగా నిలవడం, అవసరమైన సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఐదవ ఖలీఫా హజ్రత్ మీర్జా మస్రూర్ అహ్మద్ మార్గదర్శకత్వం, ఆదేశాల మేరకు మానవాళికి సేవ చేయడం, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడం తమ బాధ్యతగా భావిస్తోంది. మతం, ప్రాంతం, వర్గం అనే భేదాలు లేకుండా మానవత్వానికి ప్రాధాన్యతనిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యతను చాటిచెబుతోంది. ఇదే సేవాభావంతో హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రం గ్రౌండ్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్ కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వారికి పండ్లు, చల్లని నీటిని పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడలు ఆరోగ్యానికి, ఐక్యతకు ప్రతీకలైతే.. ఇలాంటి కార్యక్రమాల్లో సేవలందించడం సమాజం పట్ల బాధ్యతకు నిదర్శనమని చాటిచెప్పారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తూ, మానవతా విలువలను పెంపొందించేందుకు అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ యాకుబ్ పాషా, ఉపాధ్యక్షులు మొహమ్మద్ సలీం, మాజీ అధ్యక్షులు లతీఫ్ షరీఫ్, మహమ్మద్ నజీర్, స్థానిక వయోజన సమితి అధ్యక్షులు ఇక్బాల్, జిల్లా యువజన సమితి అధ్యక్షులు కబీర్ పాషా, మౌల్వీలు నూరుద్దీన్, అయ్యుబ్, ఫకీర్, సయ్యద్ కరీం, ముబారక్, హుస్సేన్, ఖాలిద్ మలకాన్, స్థానిక మౌల్వీ అయాన్ పాషా, రియాజ్, బషీర్ తదితరులు పాల్గొని సేవలందించారు.

# యువత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి..క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి

- వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026 రెండో ఎడిషన్‌ను ప్రారంభించిన మంత్రి





హనుమకొండ, తెలుగు గళం న్యూస్ అక్టోబర్

యువత ఆరోగ్య పరిరక్షణతో పాటు వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల




శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నాయిని విశాల్ ట్రస్ట్, క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్--2026 రెండో ఎడిషన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 5కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిరోజూ వ్యాయామం చేయడంతో పాటు క్రీడలు, ధ్యానం అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు సుమారు నాలుగు నుంచి ఐదు వేల మంది నమోదు చేసుకోవడం సంతోషకరమని తెలిపారు.వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని శ్రీధర్ బాబు వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. నేటి యువత ఎదుర్కొంటున్న ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారథాన్‌ను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ శ్రీగోదా రెడ్డిలను అభినందించారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం, ప్రజల్లో క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించడమే మారథాన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్యక్రమానికి మరింత స్పందన లభించడం ఆనందంగా ఉందన్నారు.మారథాన్ విజయవంతానికి సహకరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, క్రెడాయ్ ప్రతినిధులు, స్పాన్సర్లు, నిర్వాహకులు, క్రీడాకారులు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రన్నర్లు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐ వినయ్ కుమార్‌కు బీజేపీ నాయకుల సన్మానం

తెలుగు గళం న్యూస్
జాఫర్‌ఘడ్ అక్టోబర్ 17



జాఫర్‌ఘడ్ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ వినయ్ కుమార్‌ను బీజేపీ జాఫర్‌ఘడ్ మండల కమిటీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎస్ఐ వినయ్ కుమార్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగరాపు రమేష్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ వలిపాష, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మారపల్లి రవి, ధార్మిక సెల్ జిల్లా కో-కన్వీనర్ ఎదులపురం మదన్ మోహన్, గీత సెల్ జిల్లా కన్వీనర్ మెరుగు రామరాజు గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కు స్వప్న, మాజీ మండల అధ్యక్షుడు తౌటి సురేష్ గౌడ్, హిమ్మత్‌నగర్ వార్డు సభ్యుడు, మండల ఉపాధ్యక్షుడు తాటికాయల సుభాష్ చంద్రబోస్, మండల ప్రధాన కార్యదర్శి అన్నెపు రమేష్, గొలుసుల లింగ యాదవ్, మన్ కీ బాత్ మండల కన్వీనర్ గిరగాని యాదగిరి గౌడ్, మీడియా కన్వీనర్ సిరికొండ అక్షయ్, ఓబీసీ మోర్చా మండల కన్వీనర్ పందిబోయిన యాదగిరి, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి సురేష్ గౌడ్, మండల నాయకులు వాసం రవి, నిరటి లక్ష్మణ్, బూత్ అధ్యక్షుడు చవనబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి లక్ష తో అలంకరణ"




సత్తుపల్లి/వేంసూరు, అక్టోబర్17(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహం వద్ద శనివారం మహాలక్ష్మి అవతారాన్ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ నిర్వాహకులు అమ్మవారికి లక్ష రూపాయలతో అలశీకరణ చేశారు.భవానీ మాలధారణలు చేసి భక్తులు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.ప్రతి రోజు విశిష్ఠ పుజలు,బతుకమ్మ ఆట,పాట మహిళలతో సందడి వాతావరణంలో జరుగుతున్నాయి.శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు.

# చలో హైదరాబాద్.. సీఐటీయూ మహాధర్నాలను జయప్రదం చేయండి

- కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలి
- సీఐటీయూ మండల కన్వీనర్ గుండబోయిన రాజు



తెలుగు గళం న్యూస్ జఫర్గడ్ అక్టోబర్ 17

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ మండల కన్వీనర్ గుండబోయిన రాజు విమర్శించారు.కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద అక్టోబర్ 25, 26 తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహుళ రోజుల మహాధర్నాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచకుండా పెట్టుబడిదారీ వర్గాలకు కార్మికుల శ్రమను దోచుకునే స్వేచ్ఛ కల్పిస్తోందని విమర్శించారు.కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో కేంద్ర కార్మిక సంఘాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని, ప్రభుత్వ అనుకూల సంఘాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహించకపోవడం, పథకాల అమలులో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గత 12 ఏళ్లలో సుమారు రూ.25 లక్షల కోట్ల ప్రజాధనాన్ని పారిశ్రామికవేత్తలకు దారాదత్తం చేశారని ఆరోపిస్తూ, కార్మిక ఉద్యమాలపై ఉక్కుపాదం మోపే విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కేంద్ర బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాధర్నాలో అక్టోబర్ 25న రాష్ట్రంలోని ప్రైవేటు పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, రవాణా రంగ కార్మికులు, హమాలీలు సహా అసంఘటిత రంగ కార్మికులందరూ తరలివచ్చి తమ సంఘటిత శక్తిని ప్రదర్శించాలన్నారు.కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా 30 డిమాండ్లతో మహాధర్నా కొనసాగుతుందని గుండబోయిన రాజు తెలిపారు. కార్మికుల ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ టౌన్ కార్యదర్శి కాటా సుధాకర్‌తో పాటు హమాలీ కార్మికులు చిరంజీవి, రామచంద్రు, కుమారస్వామి, సురేందర్, రాజు, ఎల్లస్వామి, నర్సింగ్, సాంబరాజు, లక్ష్మీనరసు, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

తెలుగు గళం న్యూస్
మహబూబాబాద్ జిల్లా.



ఇందిరమ్మ మైనార్టీ మహిళా పథకం కింద మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మైనార్టీ సోదరీమణులకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, మరిపెడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోతు రవి నాయక్,వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు,ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ బాలికకు అండగా కేసముద్రం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్

- నాయనమ్మను కోల్పోయిన బొద్దుల అఖిలకు అండగా నిలిచి.. చదువు, భవిష్యత్తుకు భరోసా
- కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేత
- ధనముంటే సరిపోదు.. ఆపదలో ఆదుకునే గుణముండాలి: పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

కన్నవారికి దూరమై , నాయనమ్మే సర్వస్వంగా బతుకుతున్న ఆ బాలికకు ఆ ఆసరా కూడా దూరమైంది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బొద్దుల అఖిలకు కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అండగా నిలిచారు. 'నువ్వు ఒంటరిదానివి కాదు.. నీకు అన్నగా నేనున్నా' అంటూ ఆప్యాయంగా భరోసానిచ్చారు. అంతటితో ఆగకుండా ఆ కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బొద్దుల అఖిల జీవితం చిన్ననాటి నుంచే విషాదాలతో నిండిపోయింది. అఖిల తల్లి,తండ్రి బొద్దుల శ్రీనివాస్ రెండేళ్ల వయసులోనే దూరమై కన్నవారి ప్రేమను కోల్పోయి అనాథలాగా మిగలాగా అప్పటి నుంచి నాయనమ్మ స్వరాజ్యం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ అఖిలను అల్లారుముద్దుగా పెంచి పోషించింది. తనకు ఉన్నదంతా మనవరాలి భవిష్యత్తేనని భావించి, ఆమె చదువుకు అండగా నిలిచింది.నాయనమ్మ ప్రోత్సాహంతో చదువులో రాణించిన అఖిల కాట్రపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం వరంగల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ విద్యాసంస్థలో ఉన్నత విద్య అభ్యసిస్తోంది. ఇలాంటి సమయంలో నాయనమ్మ స్వరాజ్యం మరణించడంతో అఖిలకు దిక్కెవరనే ప్రశ్న ఎదురైంది. తనను కంటికి రెప్పలా కాపాడిన నాయనమ్మ దూరం కావడంతో ఆ బాలిక కన్నీరుమున్నీరైంది.సర్వస్వం నాయనమ్మే అనుకొని బ్రతుకుతున్న అఖిల చివరకు ఆమెకే తలకొరవి పెట్టాల్సిన కన్నీటి సముద్రం లో పడేసాడు దేవుడు అని గ్రామ ప్రజలు పాప ను చూసి కన్నీటి పర్యంతం అవుతున్నారు దీనితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అఖిలకు అన్నగా అండగా సమ్మయ్య గౌడ్

అఖిల నాయనమ్మ స్వరాజ్యం మరణవార్త ను కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జల్లే యాకంభ్రం, ప్రభాకర్ ద్వారా తెలుసుకున్న కేసముద్రం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ వెంటనే కాట్రపల్లి గ్రామానికి చేరుకున్నారు. నాయనమ్మను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అఖిలను పరామర్శించి ధైర్యం చెప్పారు. 'నువ్వు ఒంటరిదానివి కావు.. నీకు ఒక అన్నగా నేను అండగా ఉంటాను. నీ చదువు, భవిష్యత్తు విషయంలో నీకు తోడుగా నిలుస్తాను' అంటూ భరోసానిచ్చారు.అంతేకాకుండా ఆ కుటుంబానికి ఒక క్వింటాల్ బియ్యం, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు బాలిక భవిష్యత్తుపై భరోసా కల్పించారు. గ్రామ పెద్దలు, కుల సంఘం నాయకులతో కలిసి అంత్యక్రియల నిర్వహణలోనూ భాగస్వామ్యమయ్యారు.





ధనముంటే సరిపోదు.. ఆపదలో ఆదుకునే గుణముండాలి

ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్ మాట్లాడుతూ, కేవలం ధనం ఉంటే సరిపోదని, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునే మంచి మనసు ఉండాలని పేర్కొన్నారు.నాయనమ్మను కోల్పోయి అనాథగా మిగిలిన బాలికకు అన్నగా అండగా నిలవడంతో పాటు, ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించిన చిలువేరు సమ్మయ్య గౌడ్ సేవాభావాన్ని అభినందించారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.సర్పంచ్ ఎదురబోయిన సురయ్య,జల్లె యాకాంభ్రం మాట్లాడుతూ మన కేసముద్రం లోనే కాకుండా మండలం లోని అన్ని గ్రామాల్లో ఏ కాదుభీదవాడి ఇంట్లో విషాదం జరిగినా, ఆపదలో ఉన్నా సమ్మిగౌడ్ దృష్టికి తీసుకెళ్లండి అనే రీతిలో సమ్మిగౌడ్ సేవలు ఉన్నాయని,బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న సమ్మన్న సేవలు మరువలేనివి అన్నారు..అఖిలకు భవిష్యత్తులోనూ తోడ్పాటు అందిస్తామని తెలిపారు. నాయనమ్మను కోల్పోయిన బాలికకు ఆప్యాయతను పంచుతూ,ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించిన చిలువేరు సమ్మయ్య గౌడ్ స్పందనపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సామల నర్సయ్య ఉపసర్పంచ్ షాగంటి యాదగిరి,సిరికొండ మల్లయ్య,పుట్ట ప్రభాకర్, జాటోత్ లక్ష్మణ్,రుద్ర యాదగిరి,దాసరి శ్రీనివాస్, బేతూ సత్యం,సాంబారి వీరాస్వామి,కర్నూరపు వెంకటేశ్వర్లు,నల్లగొప్పుల సాయిలు,బోదాసు చంద్రయ్య,సిరికొండ వెంకన్న,అడప రవీందర్, ఓర్సు ముత్తయ్య,నాయిని స్వామి,యెడల్లి దేవరాజు,దేవులపల్లి కట్టయ్య,జినుకల శ్రావన్, నూణావత్ మాను, పాలికోజు బీష్మచారి మరియు కాంగ్రెస్ పార్టీ పెద్దలు, పద్మశాలి కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి"

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే దంపతులు"

సత్తుపల్లి,ఆర్ సి,అక్టోబర్ 17, (తెలుగుగళం) న్యూస్:

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సత్తుపల్లి పట్టణం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో శనివారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశ కార్యక్రమం లో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ లతో పాటు వారు పాల్గొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత కు పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. పెద్దలు రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ విజయం తో మనం అందరం గెలిపించుకోవాలి అని కోరారు. ప్రతి ఒక్కరూ మీ పట్టణాల్లో, గ్రామాల్లో, వార్డుల్లో అర్హులు గల అందరిని ఎమ్మెల్సీ ఎన్నికలు కోసం ఓటర్ ఆన్లైన్ చేపించాలి అని కాంగ్రెస్ శ్రేణులకు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య మంత్రి బట్టి, మంత్రి తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘు రాం రెడ్డి లకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యూత్, మహిళలు సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వార్డు నెంబర్స్, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.